పొడుగు నీడలు

ఆ రోజు సాయంత్రం బీచ్ ఇసుకలో అడుగు పెట్టీ పెట్టగానే రంగారావు ముఖం ముకుళించింది. ఆ ఎర్రపూల అంచుగల తెల్లచీర అతనికి బాగా గుర్తే. నెలరోజుల్నుంచీ ప్రతిరోజూ చూస్తున్నాడు. ఆమే. ఎంత దూరంనుంచైనా గుర్తు పట్టగలడు. ఆమెను చూసినప్పటినుంచీ ఏవేవో దృశ్యాలు సృష్టించుకుంటున్నాడు. అకస్మాత్తుగా ఎవరో సెమీసూట్‌లోని వ్యక్తి తన దృశ్యాల కాపీరైటు హక్కుకి భంగం కలిగిస్తున్నాడు. ఎవరా తెల్లషర్టు? తెల్లషర్టు! రంగారావు మనసులో అతని కిష్టంలేని ఊహ ఏదో తట్టింది. ఒక్కసారిగా కుంగిపోయాడు. తను వట్టి బుద్ధిహీనుడు. తనకి తెల్లషర్టు లేకపోతే కుట్టించుకోవాలనైనా తనకెందుకు తోచలేదు ?

ఆకాశంలోని ఎరుపురంగు క్రమంగా కొండల వెనకాలకి ప్రవహించిపోతున్నకొద్దీ ఆ ఇద్దరు వ్యక్తులకీ దగ్గిరౌతున్నాడు రంగారావు. నడుస్తూ నడుస్తూ ఠపీమని ఆగిపోయాడతను. ఆ తెల్లషర్టు మరెవరో కాదు. నిస్సందేహంగా రామకృష్ణ. వాళ్ళిద్దరూ ఏదో మాట్లాడుతూ పకపక నవ్వుతున్నారు. నమ్మలేకపోయాడు రంగారావు. నిన్న సాయంత్రందాకా ఆమె ఎవరో ఎరగని రామకృష్ణ ఇవాళ ఎంతో పరిచయం ఉన్నవాడిలాగా ప్రవర్తిస్తున్నాడు. ఇలాంటిది సంభవమని రంగారావు కలలోకూడా ఊహించలేదు. ప్రియమిత్రుడైన రామకృష్ణమీద అతనికి మొదటిసారిగా కోపమూ, ఈర్ష్యా కలిగాయి. స్నేహితుడైన వాడిలాగేనా చెయ్యటం ? కాని పూర్తిగా అతనిమీదే నింద తోసివేయటం తప్పేమో! తను స్పష్టంగా చెబితే బావుండేది. కనీసం సూచనైనా చేశాడా ? ఒకరోజు వెనక్కి పోయాడు రంగారావు.

"ఎవర్రా ?"

"ఏమో"

"తెలియదన్న మాట"

"ఊఁహుఁ"

"నువ్వుకూడా ఇవాళేనా చూడటం ?"

"కాదు. రోజూ చూస్తూనే ఉన్నాను"

"ఎన్నాళ్ళనుంచి?"

"చాలా రోజుల్నించి"

"అయితే మరి...?"

ప్రశ్నార్థకంగా అసంపూర్తిగా వదలి రంగారావు ముఖంలోకి చూశాడు రామకృష్ణ.

"ఎవరయితే మనకేం ?"

"అయితే సరేలే. నువ్వేదో అదోలావుంటే అడిగాలే"

రంగారావేమీ అనలేదు. కాని అప్పుడప్పుడు దొంగతనంగా ఆమెవైపు చూస్తూనే ఉన్నాడు. రామకృష్ణ గమనించనట్టుగా సముద్రంలో అలల ఆనందంలో భాగం పంచుకుంటున్నాడు. ఏవేవో దృశ్యాలు రంగారావు ఊహా ప్రపంచంలో చకచక గడిచిపోతున్నాయి.

"వరదబాధితుల సహాయార్థం"

"బీచ్‌లోనా ?"

"క్షమించండి. కాని మీ ఇల్లు ఎక్కడో ?"

ఫలానా...ఫలానా...

"థాంక్స్ రేపు కనిపిస్తాను"

"అలాగే"

తరవాత ?

ఆకాశమంతా శూన్యం. అయినా అదేం ప్రారంభం ? మొదట్లోనే యోచన అంత ఫలప్రదమూ కాదు. శుభప్రదమూ కాదు.

"మీ రేమీ అనుకోకపోతే..."

"అనుకోనులెండి"

"మరేమీ లేదు. మీతో మాట్లాడాలని వుంది"

"మాట్లాడటానికేం ?

ఏం మాట్లాడాలి ? ఏ విషయం గురించి ? ఏదైనా సంఘటన జరిగితే బావుండును.

"ఎంతో కృతజ్ఞురాలిని"

"ఆc. దానికేం. నేను చేసిందేముంది మహా"

"సమయానికి మీరు కనిపించకపోతే"

"అలా జరగాలని వుంది.మీరు సహాయం—నాకు చేతనైనంతవరకే ఐనా—చెయ్యగలగటం నా అదృష్టం"

ఏం సహాయం? ఛ...ఛ. ఆలోచన సాగటంలేదు. అసలివన్నీ ఎందుకు? సూటిగా పోవటం మంచిది.

"మీరెవరో నాకు తెలియదు. మీ పేరేమిటో తెలియదు. మీ భాషే మిటో తెలియదు. మీరేం చదివారో తెలియదు. ఏం చేస్తున్నారో తెలియదు. కాని మిమ్మల్ని గురించి ఒక్క విషయం తెలుసు. మీరు నా హృదయం అపహరించారు. మీరేమన్నా సరే. డొంకతిరుగుడు లేకుండా చిత్తశుద్ధితో చెప్పాను."

"షటప్" అంటే? నోరు మూసుకుని కాళ్లకి బుద్ధి చెప్పటమేనా?

అదికాదు పద్ధతి. మరేది? ఏమో. ఏదయితేనేం? తర్వాత చూసుకో వచ్చు. తరవాతంటే? వీలైనప్పుడు ఎవరికి? ఇద్దరికీ—కనీసం ఆమెకి. ఎప్పుడు వీలవుతుంది? అయినప్పుడే అందాకా...ఆకాశంలో, మేఘాల మధ్య—

ఆ అందాలరాణి ప్రక్కన ఎవరో ఆ అదృష్టవంతుడు. ఓహో! ఏం అదృష్టం! అందరూ చూస్తున్నారు—బీచ్‌లో, రోడ్డుమీద, సినిమా థియే టర్లో, అన్నిచోట్లా, మెచ్చుకుంటున్నారు. ఈర్ష్యపడుతున్నారు. ఆకాశం మీదనుంచి దిగొచ్చినట్టుగా... గర్వంగా...ఆనందంగా...పడ్డది. "చీకటి పడుతోందిరా బ్రదర్" బుజంమీద చెయ్యి పడ్డది.

ఉలిక్కి పడ్డాడు రంగారావు. అప్పుడూ, ఇప్పుడూ కూడా. ఇప్పు డింకా సంధ్యే. ఈర్ష్యపడేవాళ్ళలో ఇప్పుడు తనుకూడా ఒకడు. ఆ ఇద్దరూ ఇంకా అక్కడే—తనదే పొరపాటు. కాని రామకృష్ణ! వాడెప్పుడూ అంతే వాడి మనసులో నిర్ణయాలుతప్ప ఆలోచన లుండవల్లే వుంది. మొన్నటికి మొన్న—నిన్నకాక మొన్న—

రంగారావు మనసంతా చికాగ్గావుంది. రాత్రి ఎనిమిదయింది. హోటల్లో భోజనంకూడా చెయ్యలేదు; చెయ్యాలనిపించలేదు. విసుగ్గా కాంప్‌కాట్ మీద పడుకున్నాడు. ఆఫీసర్ ముందు తనెంత చులకనయ్యాడు' సాయంత్రం ఆరుదాటినా ఆ వెధవ జీతాల బిల్లు చెక్ చెయ్యటం పూర్తి కాలేదు. తనూ మనిషే. యంత్రంలాగా ప్రొద్దుటినుంచీ పనిచేస్తున్నాడు. ఇంకా కొంచెంసేపు ఆఫీసులో కూర్చోటానికి తనకేమీ అభ్యంతరం ఉండక

పోయేదే...కాని మళ్ళీ చీకటి పడితే ఆ ఎర్రపూల అంచుగల తెల్లచీర బీచ్‌లో అదృశ్యమౌతుంది. లేచాడు. జీతాల బిల్లు డ్రాయర్‌లోకి తోసేసి. ప్రత్యక్ష మయాడు జనరల్ మేనేజర్ యముడిలాగా.

"జీతాల బిల్లు చెక్ చెయ్యటం అయిందా ?"

"ఇంకా కొన్ని పేజీలు మిగిలాయండి-రేపు"

"అవి పూర్తిచేసేసి వెళ్ళండి"

"కొంచెం పనుందండి"

"అర్జంట్"

"కాని..."

"తప్పదు"

"ఇప్పటికే ఆరయింది"

"మీరు చాలా స్లో"

ఒళ్ళు మండింది రంగారావుకి.

"ఏ విషయంలో ? ఇంటికి పోవటంలోనేనా ? అనబోయి "క్షమించండి. మీరు పొరబడుతున్నారు" అని మాత్రం అన్నాడు.

ఆఫీసర్‌కి మండింది ఈసారి.

"నేననవసరంగా ఏమీ అనదలచుకోలేదు. నాక్కావలసింది పని. మాటలూ, సోమరితనమూ కాదు."

రంగారావుకి ముఖం జేవురించింది. ఏమనాలి ?

"తాహతు తెలుసుకొని మాట్లాడండి"

"ఏమిటీ ?"

"మాటలంటే పడేవాళ్ళెవరూ లేరు"

"చాలాదాకా ఉందే"

"నేను చాలా సహనం చూపిస్తున్నాను. కాని మీరపార్థం చేసుకుంటున్నారు. ఉద్రిక్త పరిస్థితికి తరుముతున్నారు"

"షటప్"

"యూ షటప్. ఇదిగో రాజీనామా. మర్యాద నేర్చుకోండి. వెడుతున్నాను."

రంగారావు పెదవులు వొణికాయి. అంతే. అలాగే అనాలి. కాని, కొంచెం తటపటాయించాడు.

సమాధానం ఏమీ రాకపోవటంవల్ల ఆఫీసర్ మరి కొంచెంసేపు మౌనం వహించి తరువాత !"ఇప్పుడే చెబుతున్నాను. ఇవాళ ఈ బిల్లుల చెకింగ్ అయితే కాని మీరు వెళ్ళటానికి వీల్లేదు" అని గంభీరంగా అనేసి వెళ్ళిపోయాడు.

రంగారావు మనసు మనసులోలేదు. ముఖం చిట్లించుకున్నాడు. కోపంగా కుర్చీలో కూలబడ్డాడు. విసురుగా డ్రాయిర్ తీశాడు. జీతాల బిల్లు విసిరిడ్రాయరుమీదకొట్టాడు. ఎంత సాహసం ఈ ఆఫీసర్ కి! తనేం చేస్తే బావుండేది. ఏవేవో దృశ్యాలు...

జీతాల బిల్లు ఆఫీసర్ ముఖంమీద విసురుగా కొట్టుకుంది. కలం నేల మీద ధామ్మనిపడి సిరాకక్కింది.

"వీల్లేదూ. ఇదిగో మీ కళ్ళముందే ఇప్పుడే లార్డులా వెళ్ళిపోతున్నాను చూడండి...వీలుందా?"

రంగారావుకి చాలా సంతృప్తిగా ఉంది. పోనీ అలా కాకపోతే...

సరాసరి జనరల్ మేనేజర్ ఆఫీసుదగ్గిరకుపోయి నుంచున్నాడు. సిగరెట్ పొగ గుప్పుమంది. ఆఫీసర్ ముఖం చిట్లించుకుని ముందుకు చూశాడు.

"వాట్...?"

"ఎస్"

"ఎంత సాహసం!"

"ఇదిగో, అకౌంట్స్ అసిస్టెంట్ రంగారావు రాజీనామా. గుడ్ బై"

చిరునవ్వు! చిన్నబోయిన ముఖం!

రంగారావుకి నవ్వొచ్చింది. అంతే, అలాగే అవమానించాలి. చెప్పుదెబ్బ కొట్టినట్టుగా......లేకపోతే... ఇంకా ఏడిపించాలంటే...

ఇంకేవేవో దృశ్యాలు!

కలం ఆగిపోయింది. మనస్సు పనిచేస్తోంది.

"ఏమిటి? ఇంకా కాలేదా?"

ఉలిక్కిపడ్డాడు రంగారావు.

"స్లో. స్లో. ఆశ్చర్యం! ఇలాంటివాళ్ళని నే నెక్కడా చూడలేదు."

రంగారావుకి చప్పున గుర్తుకొచ్చింది, పొరపాటు. పోనీ, ఇదే మంచి అదును.

"మొదటే చెప్పాను, ఈ పని పూర్తికాందే ఇక్కడినుంచి కదలటానికి వీల్లేదని! ఇహ మీ ఇష్టం."

జనరల్ మేనేజర్ పంతంగా అన్నాడు. చ్రసన కోపంవచ్చింది రంగారావుకి. అతని పెదవులు వొణికాయి. కాని...కాని...రంగారావు ముఖం చిట్లించుకున్నాడు. మాట్లాడలేదు. మేనేజర్‌కూడా ఏమీ మాట్లాడలేదు. వెళ్ళిపోయాడు.

రంగారావు విచారించాడు పశ్చాత్తాపపడ్డాను. అని ఉండాలిసింది తలవాచేట్టు చీవాట్లు పెట్టివుండాలిసింది...అప్పుడూ మళ్ళీ రూంలో కూడా అలాగే అనుకున్నాడు అతను. ఏమిటో అసంతృప్తిగా, అశాంతిగా వుంది. అవును. ఎప్పుడో తప్పకుండా ఆ మేనేజర్‌కి తనికీ యుద్ధం జరుగుతుంది. జరిగితీరుతుంది. తనలాంటి మానాభిమానాలు కలవాడు ఇలా ఎంతకాలం సహిస్తాడు. ఎప్పుడో ఒకరోజు ఆ ఆఫీసర్ ముఖంమీద కాగితాలు విసిరికొడతాడు. ఎప్పుడు? ఎప్పుడో ఒకరోజు! తప్పదు.

ఎవరో రూం తలుపు తట్టారు. ఇంకెవరు? రామకృష్ణే. ఈ గొడవలో రామకృష్ణ సంగతి మర్చిపోయాడు. స్నేహితుడికి రమ్మని ఉత్తరంరాసి వాడి సంగతే మర్చిపోయి పడుకున్నాడు, ఈ వెధవ గొడవలో—

"స్టేషన్‌కి రాలేదేం?"

"మనస్సు బావుండలేదురా."

"ఏం జరిగింది?"

చెప్పాడు. రామకృష్ణకూడా రంగారావు అభిప్రాయాలతో ఏకీభవించాడు. ఎప్పుడోఒకసారి తప్పకుండా బుద్ధిచెప్పాలంటే 'తప్పకుండా' అని వంతపాడాడు. భోజనాలూ అవీ అయి పడుకోబోతుండగా మాటవరసగా అడిగాడు రంగారావు.

"అయితే నీకు సెలవు సులభంగానే దొరికిందన్నమాట.

"ఆహా."

"మీ ఆఫీసర్ మంచివాడల్లే ఉన్నాడు"

"ఆ. మంచివాడే.

"అడగ్గానే ఇచ్చాడా?"

"అంత మంచివాడు కాదులే"

"వీల్లేదన్నాడా"

"ముమ్మాటికీ వీల్లేదన్నాడు. ముమ్మాటికీ వీలుందన్నాను. అయితే అరే అని ఒప్పుకున్నాడు"

రంగారావు ఆశ్చర్యపోయాడు.

"సరిగ్గా చెప్పు. అసలేం జరిగింది ?"

"ఏముందీ ? ముందు మర్యాదగా సెలవు కావాలని అడిగాను. అవసర మనిచెప్పాను. ఇవ్వటానికి వీల్లేదన్నాడు. 'వీలెందు కుండదు ? కాకపోతే రాజీ ఇవ్వాలిసి రావొచ్చు. అంతేగా, అన్నాను. అంతకుముందు ఒకసారి ఛీఫ్ అకౌంటెంట్‌తో ఓ చిన్న ఘర్షణ జరిగిందిలే. లెడ్జర్ పోస్టింగ్స్ పూర్తి కానిదే ఎంత చీకటిపడ్డా ఇంటికి వెళ్ళటానికి వీల్లేదన్నాడు. వెంటనే లెడ్జర్ మూసేసి వెళ్ళాను. పక్కన జనరల్ మానేజర్ కూడా ఉన్నాడు. ఇద్దరూ నోళ్ళు తెరుచుకుని చూస్తూ ఉండిపోయారు. మళ్ళీ అలాంటి సంఘటన జర గటం పాపం ఏ ఆఫీసర్ కిష్టం వుంటుంది. సెలవిచ్చేశాడు. రంగారావునోరు తెరుచుకుని విన్నాడు. అతని ఆశ్చర్యానికి అంతులేదు.

"ఉద్యోగంనించి తీసెయ్యలేదా ?"

"తప్పేవరిది ? నాది కాదుగా. అవిధేయత అనొచ్చు. కాని దేనికైనా హద్దుంది. వాళ్ళు హద్దుమీరితే అది వాళ్ళకి తెలియ చెప్పటం మన విధేమో, ఏమయితేనేం నాకు మటుకు ఉపన్యాసన చెప్పలేదు. ఏమనుకున్నారో. ఏమో నేను దేనికైనా సిద్ధంగానే ఉన్నాను. అందువల్లఆ నిమిషంలో ఆ విషయం ఆలోచించలేదు."

ఎప్పుడూ అంతే రామ్మూర్తి ! తనకి మొదటినించీ తెలుసు. ఎందుకూ, ఆ రోజు సాయంత్రం జీవితంలో మర్చిపోవటానికి వీల్లేనిది—

వీధుల్లో ఎక్కడ చూసినా బారులు బారులుగా జనం. పొద్దుటినించీ అంతే. రేడియోలో తెలుగులో వార్తలు. చివరి అంశం విన్నప్పటినించీ అంతే నినాదాలు. ఉద్రేకం. అన్ని కాలేజీల విద్యార్థులు, అన్ని సంస్థల ఉద్యో గులు, పెద్దలు, చిన్నలు స్త్రీలు అంతా వీధులనిండా బారులు తీర్చిపోతూ ఒకటేకేక—

పోలీసులు భయంతో చూస్తున్నారు. తిరుగుతున్నారు... గొప్ప సంచ లనం. ఉన్నట్టుండి జనం గుమిగూడారు. ఏదో జరిగింది. ఏదో ఏమిటి ? రిజర్వుపోలీసులు ఎవరినో కొట్టి అరెస్టు చేశారు. ఉద్రేకం పెరిగిపోయింది. విదు

దల చెయ్యాలని తీవ్రంగా అరిచారు జనం. కలెక్టరు ఆఫీసు ఆవరణలోకి రాకుండా పోలీసులు కాపలా...

రంగారావుకి ఆపుకోలేనంత క్రోధం, ఉద్రేకం కలిగాయి. ఏమిటీ దౌర్జన్యం! పోలీసులు లాటీలతో జనాన్ని నెడుతున్నారు. బాయ్‌నెట్లు పట్టుకు జడిపిస్తున్నట్టుగా పోజులుపెట్టి నుంచున్నారు. అందరి ముఖాల్లో తీవ్ర అసహ్యాసం, కోపం, ఉద్రేకం ప్రతిఫలించాయి—ఎవరో కుర్రాడిని వెనక్కి బలంగా తోశాడు రిజర్వ్ పోలీస్. రంగారావుకి ముఖంలోకి నెత్తురు చిమ్మింది. ఇటే వోస్తున్నాడు అతను తుపాకీ, లాటీ నెడుతూ జనాన్ని.

రంగారావు మనసులో ఏవేవో దృశ్యాలు... ఆ లాటీ ఠపీమని పట్టుకు లాక్కుంటే—

ఎవరో పడిపోయాడు. పడిపోయాట్ట. పోలీసు కొట్టాడు. డౌన్‌విత్ వియొలెన్స్. అహింసా వాది శ్రీరాములుగారికీ జయ్....ఆ కుర్రాడు...... స్టూడెంట్...బి. కామ్ చదువుతున్నాడుట. ఎవరో గుర్తుపట్టారుట. జనం అరుస్తున్నారు. ఎవరు? రంగారావా? జయ్ రంగారావుకీ రంగారావుని వెంటనే విడువలచెయ్యాలి. అరె అప్పుడే ఆఫీసు లోపలికి తీసికెళ్ళారు—అరెస్ట్! అరుపులు గోల.

ఊరుకుంటారా జనం? మరి విడుదల చేశారు. అఖండవిజయం. ఎవరో బుజాలమీద మోసుకుపోయారు. హీరో...రంగారావ్. త్యాగి! వీరుడు! యోధుడు!—

పోలీసు వెనక్కి నెట్టాడు—రంగారావుని. ఆ లాటీ! రంగారావు వెనక్కి తూలాడు. ముందుకుదూకి ఆ లాటీని...

ప్చ్. ఎంతబావుండేది. ఆలాటీ లాగిపారేస్తే! లాగిపారేస్తాడు, ఈసారి! అవును మరి. మితిమీరి విజృంభిస్తుంటే, ఎప్పుడో ఓసారి...

అరె. ఎవరినో పోలీసు లాటీచార్జి చేశాడు. కిందపడ్డాడు కుర్రాడు ఎవరు. ఎవరు? మూగారుజనం...రామకృష్ణ. అవును, రామకృష్ణే! అన్నాడు బయటికి. విన్నారెవరో, రామకృష్ణట. జనం మూగారు తనచుట్టూ. చెప్పాడు క్లాస్‌మేట్, బి. కామ్ విద్యార్థి జయ్. రామకృష్ణకీ డౌన్‌విత్ వయొలెన్సు అహింసావాది శ్రీరాములుగారికి జయ్. రామకృష్ణని వొదిలేయాలి, ఒకటే గోల. హడిలిపోయారు పోలీసులు. బుజాలమీద మోశారు వాడిని. హీరో, జయ్ రామకృష్ణకీ...యోధుడు! వీరుడు!

అరె. చూస్తూండగానే వీడు...! అసలు రామకృష్ణ ఎప్పుడూ అంతే. తను చూళ్లేదూ, ఆ రోజు డిబేట్‌లో...

"పరిశ్రమలు జాతీయం చెయ్యటం అనర్థదాయకం."

అటూ ఇటూ టకటక మాట్లాడేవారు విద్యార్థులు. సంకుచితత్వం ప్రబలి స్వార్థంమాత్రం అధికారం చలాయిస్తూ మనుషుల మనసుల్ని బానిసలుగా చేసి సొంతలాభానికి తరిఫీదు ఇస్తున్నప్పుడు, పరిశ్రమల్ని జాతీయం చెయ్యటం అన్యథా శరణ్యం లేదు. స్వప్రయోజనాలకోసం, దేశక్షేమాన్ని, మానవ సమాజ శ్రేయస్సునీ నిర్లక్ష్యంచేసి శ్రామికుల్నీ, సామాన్యుల్నీ పీడించే పాడుపనికి దోహదం కలిగించిన పెట్టుబడిదారీ విధానంనుంచి పరిశ్రమలు విముక్తి పొందాలి; ప్రభుత్వపరం కావాలి. అప్పుడే దేశక్షేమం పదిలం.

వివాదాలవల్ల లాభం శూన్యం. సొంతలాభంకోసం పరిశ్రమల పెట్టుబడిదారులు అన్యాయంగా ఇతరుల్ని పీడిస్తున్నారనటంలో అర్థంలేదు. ఉత్పత్తి ననుసరించే ఉత్పత్తిదారులు ప్రతిఫలం పొందుతున్నారు. బ్రిటన్‌లో జాతీయం చెయ్యబడ్డ పరిశ్రమల గతేమయింది? అవి పెట్టుబడిదారీ వర్గాలకింద ఉన్న పరిశ్రమలకంటే ఉన్నత స్థాయిలో ఉన్నాయా? జరగాలిసింది మనుష్యుల్ని శంకించటం కాదు, సరిగ్గా అర్థం చేసుకోటం.

వాద ప్రతివాదా లీ విధంగా జరిగాయి.

చర్చ జరుగుతున్నంతసేపూ రంగారావు మనసులో దుమారం రేగుతూనే వుంది. చర్చ అతనికి చాలా అసంతృప్తి కలిగిస్తోంది. తనీ విషయంమీద బాగా చదివాడు. ఎవరూ మాట్లాడాలిసిన విధంగా మాట్లాడలేదు. పరిశ్రమలు వ్యక్తిపరంగా ఉన్నందువల్ల కలిగిన లాభనష్టా లేమిటి? సాంకేతికంగా, ఆర్థికంగా, పారిశ్రామికంగా, సామాజికంగా వ్యక్తి యాజమాన్యం ఏ ఏ ఫలితాలు సాధించింది? ఏ ఏ ప్రయోజనాలు పొందింది, ఆ విధానంలోగల లోటుపాట్లేమిటి? ఈ లోటుపాట్లని ఏవిధంగా సవరించటానికి వీలవుతుంది? వీలుకాదా? అలా ఐతే పరిశ్రమల్ని జాతీయం చెయ్యటంవల్ల ఈ సమస్య పరిష్కరింపబడుతుందా? వ్యక్తి యాజమాన్యం సాధించలేని ఔన్నత్యం జాతీయ ఆధ్వర్యం సాధించగలుగుతుందా? ఏవిధంగా? ఇలా ఆలోచిస్తే నిష్పక్షపాతంగా వుంటుంది. కొన్ని పరిశ్రమల్ని ప్రభుత్వమే నిర్వహించాలిసి వుంటుందని స్పష్టమౌతుంది. అలాగే కొన్ని పరిశ్రమల్ని వ్యక్తులు నిర్వహించటమే శ్రేయస్కరంగా కనిపిస్తుంది...

ఇదంతా తను గొప్పగా విశదీకరించగలడు. అలా తను ఏకధాటిగా, అనర్గళంగా లెక్చరర్‌లా మాట్లాడేస్తే—

రంగారావు మనసులో ఏవేవో దృశ్యాలు...ప్రతి లెక్చరరూ తనవైపే చూస్తూ పాఠం చెబుతున్నాడు. విద్యార్థులంతా ఫలానా రంగారావు నా స్నేహితుడంటే నా స్నేహితుడని...ఇంకా ఇంకా. అందమైన అమ్మాయిల గుసగుసలు...అతనే రంగారావు—ఆరోజున డిబేట్‌లో—ఓహో! అవును. ఓరగా, మెరుపుల్లా మురిపించే చిరునవ్వుల దొంతరలు.

'ఇంకెవర్రైనా మాట్లాడాలనివుంటే మాట్లాడొచ్చు' అధ్యక్షుడుఅన్నాడు.

రంగారావు కదిలాడు. లేస్తే! తను పేరివ్వలేదు. తయారు చేసుకోకుండా అప్పటికప్పుడు టకటక మాట్లాడేస్తే! తనకి ఇంగ్లీషు బాగానే వచ్చు. మాట్లాడగలడు.

అధ్యక్షుడు మళ్లీ ఆహ్వానించాడు.

రంగారావు ఊహాపథంలోంచి దిగలేదు.

"అధ్యక్ష మహాశయా! సోదరీ సోదరులారా!" గంభీరంగా వినపడ్డది. ఉలిక్కిపడ్డాడు రంగారావు. రామకృష్ణ కొంచెం తడుముకుంటున్నాడు, నిలదొక్కుకున్నాడు. ఏదో మాట్లాడేస్తున్నాడు. టకటక...అరే, అన్నీ తన పాయింట్సే, లెక్చరర్లు తలూపుతున్నారు. అందరూ ముగ్ధులైపోతున్నారు..... రామకృష్ణ!

ఈ రామకృష్ణ ఎప్పుడూ ఇంతే. వాడి నేమనాలో! రామకృష్ణ వాడికి తగిన పేరుకాదు - చిచింద్రీ అంటే...

కాని ఆ క్షణాన రంగారావుకి రామకృష్ణని చిచింద్రీ అని మెచ్చుకోటానికి మనసొప్పలేదు. కొంచెం ఈసడింపుతో కూడుకున్న పేరైతేగాని -

"రంగారావ్."

సముద్రంవైపు చూస్తూనుంచున్న రంగారావు ఈ పిలుపువిని ఆలోచనలు తటాలున భగ్నంకాగా వెనక్కి తిరిగిచూశాడు. అతని గుండె గబగబ కొట్టుకుంది. ఆ ఇద్దరూ తనకి దగ్గిరగా వచ్చారు. రామకృష్ణ తనదగ్గిరికి రమ్మన్నట్టుగా సంజ్ఞ చేశాడు. వెళ్లాలనిపించలేదు రంగారావుకి. తన గొప్పతనం చూడలేదని కాబోలు, ప్రదర్శించుకోటానికి తయారయాడు.

రంగారావు ఏదో సంకోచిస్తున్నట్టుగా అలా అక్కడే నిలుచునివుండడం చూసి రామకృష్ణ మళ్లీ పిలిచాడు. వొద్దనుకుంటూనే రంగారావు కదిలాడు.

పక్కన ఆమె తను మూర్ఖుడనుకుంటుందేమోనని భయం. లేకపోతేనా వాడికి బుద్ధొచ్చేట్టు తను గిరుక్కున వెనక్కి తిరిగిపోయేవాడు. "ఇతను నా క్లాస్ మేట్, రంగారావు. ఇక్కడే ఒక కంపెనీలో అకౌంట్స్ అసిస్టెంట్ గా పని చేస్తున్నాడు. ఈమె శోభాదేవిగారు. మొన్నే ఇంటర్ ప్యాసయారు."

పరస్పరాభివాదా లయారు. రంగారావుకి ముఖం ముడుచుకోవాలనే ఉన్నా, తీరా ఆమె తన ముఖం ఎల్లప్పుడూ అలాగే ఉంటుందేమోనని అపోహ పడుతుందని చిరునవ్వు ప్రదర్శించాడు. కాని మనసులోని వికారం ముఖంలో అప్పుడప్పుడు ద్యోతకమవుతూనే ఉంది. ఆమె ఎక్కువగా ఏమీ మాట్లాడలేదు. తనూ మాట్లాడలేదు. ఆ రామకృష్ణే తెగ వాగేస్తున్నాడు. మరి కొంచెం సేపటికి ఆమె సెలవు తీసుకుంది. రూముకి వెళ్లేదాకా రామకృష్ణతో సరిగా మాట్లాడకుండా ముభావంగానే ఉన్నాడు రంగారావు. అతనంటే ఎంత కోపంగావున్నా, ఆమెతో ఎలా పరిచయం చేసుకున్నాడో తెలుసుకోవాలని రంగారావుకి మహా కుతూహలంగా వుంది. ఉండబట్టక అడిగేశాడు. తను నోరుచేసుకుని అడిగినందుకైనా సమాధానం తిన్నగా చెప్పనేలేదు రామకృష్ణ.

"మాట్లాడదలుచుకుంటే వీలే దొరకదా?" అని మాత్రం అన్నాడు. ఆ వీలు దొరక్కనేగా తన సంతోషమంతా వాడికి ధారపోయాలిసొచ్చింది! ఈ సంఘటన జరిగినతరవాత మూడురోజులు వరసగా బీచ్ కి పోవటానికి వీల్లేకపోయింది. సాయంత్రంకాగానే ఏ సినిమాకో దారి తీసేవాడు రామకృష్ణ. ప్రొద్దున్నే ఒంటిగా ఎక్కడికో వెళ్లి భోజనంవేళకి తిరిగొచ్చేవాడు. రంగారావుకి మనసులో బాగానే వుంది. రామకృష్ణ ఎక్కడి కెళుతున్నాడో తనకి తెలుసు. కావాలని తనని బీచ్ కి రానియ్యకుండా చేస్తున్నాడు. కాని అతని చొరవ తనకి మహా ఆశ్చర్యం కలుగజేస్తోంది.

ఆరోజు ప్రొద్దున్నే మామూలుగా ఎక్కడికో వెళ్లొచ్చాడు రామకృష్ణ. వచ్చీ రావటంతోనే "ఇవాళేరా, డేరామేము పీకేసేరోజు" అన్నాడు. ఇప్పటికే మొదట అనుకున్నకంటె ఒకరోజు ఎక్కువ ఉన్నాడు. అయినా మాటవరసకన్నాడు రంగారావు.

"ఏం తొందర?"

"మళ్లీ మీ మేనేజర్ కి కోపం తెప్పించటం దేనికి?"

"మేనేజర్ కోపం కాదుగా మనకి ముఖ్యం."

ఉద్దేశపూర్వకంగా అని రామకృష్ణ ముఖంలోకి చూసి వ్యంగ్యంగా నవ్వాడు రంగారావు.

"కాదులే, ఐనా మళ్ళీ త్వరలో రావాలిగా ఎలాగో."

రంగారావు ముఖం చిట్లించుకున్నాడు. అసలు విషయం చెప్పడు. అదో బెట్టు. నలుగురూ తనని హీరోలాగ గౌరవించాలని, పూర్తిగా చేసే దాకా యేమీ చెప్పడు. బహుశా వ్యవహారం నలుగురూనే వుంది కాబోలు ఇంకా. కొంచెం ఉక్రోషం వచ్చింది రంగారావుకి. ఆ స్థితిలో అనేశాడు.

"ఎందుకూ ?"

ఆ మాటలో ధ్వనించిన మాత్సర్యం రంగారావుకే అసహ్యం కలిగించింది. కాని రామకృష్ణ అదేమీ గమనించనట్టుగానే, యథాలాపంగా అడిగిన ప్రశ్నకి జవాబిస్తున్నట్టుగా అన్నాడు.

"నీ పెళ్ళికి సలహా ఏమిటి ?"

"పెళ్ళేమిటి ?"

"చేసుకోవా ?"

"బహుశా, నీకంటే ముందు కాదేమో !"

దెబ్బతీశాడు.

"ఇంకా నే నెవర్నీ ప్రేమించటంగానీ, ప్రేమించబడటంగానీ-అలాంటి సూచనగానీ, అవకాశంగానీ లేదుగా."

రంగారావు నిర్విణ్ణుడయాడు, కోత! కాని---

"నా దగ్గిర దాచకు."

"దాచలేను గనుకనే నిజం చెప్పాను. అందరికీ నీలాంటి అదృష్టం ఉండొద్దూ ?"

"అదృష్టమేమిటి ?"

"నీ గుండె ఆగిపోతుందేమోననే భయం లేకపోతే, వచ్చీరావటంతోనే అసలు విషయం చెప్పేసేవాడిని"

"ఏమిటది ?"

"ఆ ఎర్రపూల అంచుగల తెల్లచీర ధరించే అమ్మాయి లేదూ ?"

"ఆఁ...ఆమె ?"

"నిన్ను పెళ్ళి చేసుకోటాని కిష్టపడటానికి అభ్యంతరం ఆమె కేమీ ఉండదు."

రంగారావు అప్రతిభుడయ్యాడు. రామకృష్ణకేసి కళ్ళప్పగించి అలాగే చూడసాగాడు. ఆ అవస్థలోవున్న రంగారావు భుజం తట్టాడు రామకృష్ణ అభినందన పూర్వకంగా.

"నిజమా ?"

"ముమ్మాటికీ"

నమ్మశక్యం కావటంలేదు రంగారావుకి. ఈ తలవని తలంపు పరిణామం ఏమిటి ? రామకృష్ణని తను ఎంత అపార్థం చేసుకున్నాడు ! రామకృష్ణ ! వా డెప్పుడూ అంతే. మనసులో కృతజ్ఞతాభావం వెల్లి విరిసింది. కాని పైకి ఏమీ తోణకకుండా ఒక చిన్న సందేహం వెలిబుచ్చాడు.

"నీ కెలా తెలిసింది ?"

"ప్రయత్నం చేసింది నేనైతే నాకు తెలియక ఇంకెవరికి తెలుస్తుంది?"

కొంచెంసేపు రంగారావు నిశ్శబ్దంగావుండి వివరాలకోసం అభ్యర్థించాడు. రంగారావు గుణగణాలని తా నెలా తెలివితేటలతో ఆమె ముందర పొగిడిందీ, ఆమె ఆసక్తితో ఎలా విన్నదీ చిన్న కథగా చెప్పాడు.

"ఆమె ఏమంది ? ఒప్పుకుందా ?"

"నీ మొహం. ఒప్పుకున్నట్టు ఎవరైనా చెబుతారా ? అది మనం గ్రహించాల్సిన విషయం. ఇహ మిగిలిందల్లా నువ్వు మాటమాత్రం అనటమే. అంతా సాఫీగా జరిగిపోతుంది"

రంగారావు మేఘాల్లో విహరించాడు. కలలో అనుకున్న విషయం ! కేవలం కలే అయిపోతుందేమోనని చింతించిన విషయం ! ఇప్పుడు యథార్థం కాబోతుంది. రామకృష్ణ ! అది అతనికి అఖండ విజయం. అతను సాధించిన అన్ని విజయాలకీ ఇది తలమానికం. అతను సాధించిన విజయం !

హృదయవీణ అకస్మాత్తుగా అపశ్రుతి పలికింది-ఘోరమైన అపస్వరం.

రంగారావు చలించుకున్నాడు.

చంద్రుడూ, వెన్నెలా సూర్యుడి చలవ !

రంగారావు ముఖంలో కాంతి అదృశ్యమైంది. ప్రయోజకుడు రామకృష్ణ ! అతని ప్రయోజకత్వం నీడన-ఘటికుడు రామకృష్ణ ! అతని ఘటికత్వం చాటున-సమర్థుడు రామకృష్ణ ! అతని సామర్థ్యం వెలుగున-రంగారావు !

చేతకానివాడు రంగారావు. భూతద్దంలో తన చేతకాని తనాన్ని చూసుకున్నాడు రంగారావు. తనకి కావలసింది తను సంపాదించుకోలేనంత అసమర్థుడాతను ? పరుల సహాయంవల్ల, దయవల్ల బ్రతకాల్సినవాడా ?

ఆ క్షణంలో రంగారావుకి తనమీద చెప్పలేనంత అసహ్యం వేసింది. కోపం వచ్చింది. తన వ్యక్తిత్వం ఆహుతి కాబోతోంది. కావటానికి వీల్లేదు,

"నీవు వీలైనప్పుడు ఆ కాస్తమాటా అనేస్తే...."

"అనను" దృఢంగా అన్నాడు రంగారావు.

"ఏం ?" ఆశ్చర్యంగా అడిగాడు రామకృష్ణ.

"అంతే"

"ఆమె అందంగా లేదా ?"

"ఉండొచ్చు"

"చదువు చాలదా ?"

"అదికాదు"

"మరేమిటి ?"

"ఏదయితే ఏం ? నా నిశ్చయం అదీ"

"ఆమె అంటే నీ కిష్టంలేదా ?"

రంగారావు మాట్లాడలేదు.

"నేను నమ్మను. ఆ రోజున నిన్ను బీచ్‌లో చూసినవాడెవ్వడూ నమ్మలేడు. అసలు సంగతి చెప్పు"

"నా కిష్టంలేదు" అనేశాడు రంగారావు.

"బాగా ఆలోచించుకో"

"అక్కర్లేదు"

కొంచెం వికృతంగా నవ్వాడు రామకృష్ణ. తాపీగా సిగరెట్ ముట్టించి పొగ వదులుతూ ఆలోచిస్తున్నట్టుగా ఏమీ మాట్లాడకుండా కూచున్నాడు. రామకృష్ణ అంతగా ఆశ్చర్యపడనట్టు కనిపించేసరికి రంగారావు కొంచెం తల క్రిందులయాడు. రామకృష్ణ అదిరిపోతాడని తను అనుకున్నాడు. కాని అలా జరగలేదు. ఏమయినా తను ఆత్మాభిమాని ప్రవర్తించాల్సిన విధంగా ప్రవర్తించాడు. దానివల్ల గొప్ప నష్టంకలిగినా అంతగా చింతించవలసిన అవసరంలేదు, ఇప్పుడు రామకృష్ణ తనకంటె ఏ విధంగా గొప్పవాడు?

ఆ సాయంత్రం రామకృష్ణ వెళ్ళిపోయాడు. వెళ్ళిపోయేముందైనా నిజమైన కారణం చెప్పమని తనని బలవంతం చేస్తాడనుకున్నాడు రంగారావు. కాని అలాంటిదేమీ జరగలేదు. రైలు కదలబోతుండగా అడిగాడతను.

"మళ్ళీ ఎప్పుడొస్తావు ?"

"నీ చేతుల్లోనే ఉంది"

"నా చేతులో ఏముంది, సిగరెట్టు పీకతప్ప ?"

"కాసేపటికి అదీ ఉండదులే. ఈ ప్రపంచంలో ఏదీ శాశ్వతంకాదుగా రంగారావ్"

"వేదాంతంలోకి దిగావేం ?"

రామకృష్ణ నవ్వాడు. సమాధానం చెప్పాల్సిన అవసరం లేదన్నట్టుగా.

రంగారావు మెదడులో ఏవో ఆలోచనలు. వేళ్ళ మధ్యన కాలుతున్న సిగరెట్టు. వేడి వేళ్ళకి కొంచెం సోకింది. కాలే పీకవైపు ఒక క్షణం చూసి అవతలికి విసిరేశాడు రంగారావు. రామకృష్ణ నవ్వుతూ అన్నాడు.

"యూ ఆర్ ఆల్వేస్ టూ కాన్షస్ ఆఫ్ యువర్ సెల్ఫ్. ఎప్పుడూ నిన్ను నువ్వు జ్ఞాపకం చేసుకుంటూనే ఉంటావు. సిగరెట్టు నీ వేళ్లకి ఒక స్సారైనా చురకవేస్తే చూడాలని ఉందిగా"

"అంత జాగ్రత్త మనిషిని కానందుకు అభినందించటానికి బదులు ఈర్ష్య పడుతున్నావుట్రా ? నీ వేళ్ళ చురకలు చూసి సంతోషపడు. చాల్లే"

రామకృష్ణ నవ్వలేదు. రంగారావు నవ్వు ఆపేశాడు. రైలు కదిలింది. జేబు రుమాళ్ళు ఊగాయి.

స్టేషన్ దాటి నెమ్మదిగా అడుగులేసుకుంటూ నడవసాగాడు రంగారావు. రామకృష్ణ తనను గురించి ఏమనుకుంటూంటాడు ? తనొక్కడేకాదు హీరో-ధీరుడు, అభిమాని, త్యాగి-ఇంకా-ఇంకా-ఇంకా ఉన్నారు. ఎప్పుడో వస్తుంది ఉత్తరం. వాడి దగ్గిర్నించి రంగారావు పైకి తనకి కనబడేటంత చేత కానివాడు ఆచరణలో అసమర్థుడు కాడు- అవసరంవస్తే ఏమైనా-ఆఖరికి ఎర్రపూల అంచుగల తెల్లచీర అయినాసరే-నిర్లిప్తంగా నిర్లక్ష్యం చేయగలడు. అన్నట్టు, ఆ అమ్మాయి ఏమనుకుంటుందో ? పాపం !

బీచ్‌లో ఎదురౌతుంది మామూలుగా.

పలకరించడు ఎరగనట్టుగా.

తాపత్రయ పడుతోంది.

ఏం చెయ్యాలి ? మథనపడుతోంది కాబోలు. ఉన్నట్టుండి-ఒకరోజు ఒక సాయంత్రం ఆమెని ఇహాసస్పెన్సులో ఉంచడు. కుండ బ్రద్దలు కొట్టి నట్టుగా.

"అయాం సారీ. క్షమించండి" ఇంకేం చెప్పక్కర్లేదు. అర్థం చేసుకుం టుంది. రంగారావు లాంటివాడు అందరికీ అందుబాటులో ఉండేవాడు కాడు.

విచారిస్తుంది. పాపం, ఏంచేస్తాడు ? ఇంతకీ రామకృష్ణ ! వాడే. కాని జరిగిందేదో జరిగిపోయింది.

అరె ! ఆ అమ్మాయి ఎదురుగా వొచ్చేస్తోంది. ఆలోచనలో గమనించలేదు. తను బీచ్‌లో నడుస్తున్నాడు. మందమందంగా ఆమె, మెల్ల మెల్లగా తను సమీపిస్తున్నారు.

ఎందుకూ ? ఇప్పుడే చెప్పేస్తాడు తను, సూచనగా. తనెంత బాధ పడ్డాడు నిన్న టిదాకా. ఆమెనికూడా అనవసరంగా...

ఆ అమ్మాయి తనవైపు చూస్తోంది. శోభ. నిజానికి ఆ సాయంత్రం నాటి శోభ అంతా మూర్తీభవించినట్టుగా ఉంది. ఆ రామకృష్ణ అంతా పాడు చేసేశాడు. ఛీ. ఏదో పెద్ద సహాయం చెయ్యబోయి...కాని. వాడికి మాత్రమేం తెలుసు, తనలా అంటాడని...

తను చూడనప్పుడామె తనవైపు చూస్తోంది. ఆగింది—సముద్రపు శోభ చూసే మిషతో, దుర్మార్గంగా, నిర్దయగా తను ప్రవర్తిస్తే ఆ సుకుమార కోమల శరీర హృదయం పెనుగాలికి తల్లడిల్లినట్టుగా...

కాని ఏంచెయ్యగలడు ? అర్జునుడు మత్స్యయంత్రాన్ని కొట్టి జయించిన ఫలితంగా ఆ పని చెయ్యలేని, లేక చెయ్యని ముగతా నలుగురూ.

అసంభవం !

ఆమెని సమీపించాడు. పోనీ తరువాత చెప్పొచ్చు. ఆమె తనవైపు దొంగతనంగా ఎగాదిగా చూస్తున్నట్టు స్పష్టం. ఏమనాలి ?

"నేను... నేను. మర్చిపోయినట్టున్నాను...రంగారావుని" అలా అనాలని అనుకోలేదు. కాని అన్నాడు అంతే! ఆడవాళ్ళముందు నమ్రత ముఖ్యం.

"ఓ...అవునవును"

పాపం. తనకోసమే అంత పెందరాళే బీచ్ కొచ్చాడనుకుంటోంది కాబోలు. అసలు విషయం తెలియకుండా—తను ఆ పూట సెలవుపెట్టి స్టేషన్ కెళ్ళి రామకృష్ణని సాగనంపి వచ్చాడని.

పెదవులు కదిలిస్తోంది. అడుగుతుంది కాబోలు. అడగదేం ? సంకోచిస్తోంది.

ఆమె అడిగితే ?

విసుగుపుట్టి అయిదుగంటలు కానానే ఆఫీస్ విడిచిపెట్టి వచ్చేశానని తాను చెబితే.

అయిదింటికే రానిస్తారా అని ఆమె సందేహం వెలిబుస్తే—వీల్లేదన్నాడు ఆఫీసర్. కాని వాడి ముఖంమీద లెడ్జర్ కొట్టేసి వచ్చేశాడని తాను చెబితే—

అభిమాని! వెధవ ఉద్యోగం. ఆత్మాభిమానం ముందెంత? స్వతంత్రుడు-ఉదాత్త భావాలు కలవాడు.

అలాగే ఆమె అనుకుంది. పోనీ, ఆమెకాకపోతే మరో ఆమె...ఎర్రపూల అంచు కాకపోతే-మరోరంగు.

"ఆరోజు...మిమ్మల్ని పరిచయం చేసిన...ఆయన...ఆయన..." తడుముకుంటోంది. ఏమిటింత మతిమరుపు?

"రామకృష్ణ" అందిచ్చాడు.

"ఆc, ఆc...అవును. ఆయన మళ్ళీ కనిపించ లేదే"

పిడుగు పడ్డటయింది రంగారావు నెత్తిమీద. "కనిపించలేదా?"

"ఊహు. మా నాన్నగారితో ఏదో మాట్లాడాలన్నారు. మళ్ళీ రాలేదు. ఏదో బిజినెస్టుకదా! బీచ్‌లో కనిపిస్తారేమోనని చూశాను. అడ్రెస్ మర్చిపోయి ఉంటారేమో" రంగారావు ఉక్కిరి బిక్కిరయ్యాడు.

"ఊరికెళ్ళిపోయాడు లెండి. మిమ్మల్ని అంతకుముందు వాడెరుగా?

"లేదండీ. నన్ను ఎవరో అనుకుని పలకరించారట. అన్నీ చెబితే, పోనీ అదీ మంచిదేలెండి. మీ నాన్నగార్ని బాగా ఎరుగున్నవాళ్ళతో పరిచయం ఉంది' అని ఏదో చెప్పారు.

రంగారావుకి తలా తోకా అందటంలేదు. బుద్ధిపూర్వకంగా రామకృష్ణ తనని వంచించటానికి ప్రయత్నించాడా? వాడికేం లాభం? ఇలాంటి చిలిపి చేష్టలు వాడి కలవాటులేదే. తనని చూసేసరికి వాడికలా బుద్ధిపుట్టిందా?

ఏమైనా, ఆ క్షణంలో రంగారావుకి రామకృష్ణని నమిలి మింగేసేటంత కోపం వచ్చింది. అయితే, అకస్మాత్తుగా రంగారావు మెదడులో భావకిరణం మెరిసింది. ఇప్పుడు...ఇప్పుడు...ఎర్రపూల అంచుగల తెల్లచీర ధరించే శోభకీ తనకీ మధ్యనవున్న అగడ్త మరి లేదు. అభివందనీయుడు రామకృష్ణ!

అనుకోని పరిస్థితిలో తను శోభ ఎదుట నుంచుని ఉన్నాడు. నిశ్చేష్టంగా ఏదో మాట్లాడాలి! కాని...కాని ఇప్పుడు తను ఆనందసాగరంలో మునిగి తేలుతున్నాడు. ఇప్పుడు ఏం మాట్లాడినా అపకతవకగా ఉంటుందేమో! స్థిమిత పడాలి.

రామకృష్ణ మాటలు ఇప్పుడు తనకి అర్థమౌతున్నాయి. వాడలా ఎందుకు ప్రవర్తించాడో తెలిసిపోయింది! వాడెప్పుడూ అంతే! సూటిగా చెప్పడుకదా ఖర్మ!

కొన్ని నిముషాలు మౌనంగా గడిచాయి. మర్చిపోదామన్నా వీల్లేకుండా తన అదృష్టం తనని అందల మెక్కించి ఊరేగిస్తోంది. కాసేపదంతా మర్చిపోయి ఆ సంతోషం కనబడనీయకుండా ఏమన్నా అనగలిగితే...!

అసలు దేనికీ అది సరైన సమయంకాదు. దర్జాగా, ముభావంగా, అనవసర జోక్యం యిష్టంలేనివాడిలా అనేశాడు.

"మీ ఏకాగ్రతకి భంగం కలిగించటం ఇష్టంలేదు. వస్తా" ఆమె చిన్నగా నవ్వింది.

అడుగు ముందుకేశాడు.

ఏవేవో దృశ్యాలు.

సిగరెట్ పీక సెగ తగిలింది వేళ్ళకి.

రంగారావుకి నవ్వొచ్చింది. తను అజాగ్రత మనిషి కాడు. తననిగురించి తను ఎప్పుడూ శ్రద్ధ తీసుకోగలడు—ఏ పరిస్థితిలోనైనా సరే.

సిగరెట్ పీక విసురుగా అవతలికెళ్ళి పడింది. రంగారావు అన్నట్టుగా శోభ సముద్రపు శోభలో తన్మయత్వం పొందటంలేదు ఆ సమయంలో. ఆమె అంత మూర్ఖురాలేమీ కాదు.

రంగారావు ప్రవర్తన నెలరోజులనుంచీ ఆమె కనిపెట్టక పోలేదు. ఆ రోజు సాయంత్రం తనకి సుదూరంలో కూచున్న రంగారావూ, రామకృష్ణ ఏం మాట్లాడుకున్నారోకూడా మరీ ఊహకందని విషయంకాదు ఆమెకి. రామకృష్ణ కేవలం మిషతో తనని పలకరించాడని తెలియకపోలేదు. రంగారావుకి తనని ఎందుకు పరిచయం చేశాడోకూడా అభేద్యమైన రహస్యంకాదు రంగారావు మనసులో ఏముందో ఎక్సరే తియ్యాల్సిన అవసరమూలేదు. రంగారావుని గురించి తెలుసుకోవాల్సిందీ ఇంకేమీలేదు. శోభకి తెలియని దల్లా ఒక్కటే—రామకృష్ణ అడ్రస్.